శాకంబరిగా సరస్వతీమాత



కోరుట్ల పట్టణం అయ్యప్పగుట్టపైనున్న శ్రీసరస్వతీదేవి ఆలయంలో అమ్మవారిని మంగళవారం శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, కోరుట్ల


అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు అంజన్న ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఉపాలయంలోని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సూపరింటెండెంట్ హరిహరనాథ్ ఎస్పీని స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. అర్చకులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.



అంజన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

పొన్నచెట్టు వాహనంపై శ్రీవారి దర్శనం



కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి శ్రీవారు పొన్నచెట్టు వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహానికి పట్టణంలోని పుర వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలకగా భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని కొలిచారు.

అతివలే కీలకం

ఓటర్లుగా, ఆశావహుల్లో వారిదే ఆధిక్యం



జగిత్యాల జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో మహిళలే సత్తా చాటే అవకాశముంది. ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించిన గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాలో పురుషుల కన్నా మహిళా ఓటర్ల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది.

న్యూస్‌టుడే- జగిత్యాల ధరూర్‌క్యాంపు

జిల్లాలో మొత్తం 5,93,540 ఓటర్లుండగా ఇందులో మహిళా ఓటర్ల సంఖ్య 3,10,522, పురుష ఓటర్లు 2,83,010, ఇతరులు 8 మంది ఉన్నారు. గ్రామ పంచాయతీల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఉండగా మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటం, రిజర్వేషన్ల కేటాయింపులో సమతుల్యత పాటించాల్సి రావటం తదితర కారణాలతో 50 శాతం కన్నా అధికంగానే వార్డులు, సర్పంచుల స్థానాలు మహిళలకు కేటాయించే అవకాశముంది. ఎన్నికల్లో జనరల్ స్థానాల్లోనూ మహిళలు పోటీపడనుండగా గతంలో మాదిరిగా దాదాపుగా 53 శాతం వరకు మహిళలు ఎన్నికయ్యే అవకాశముంది.

3,512 వార్డులు..

జిల్లాలో 18 మండలాలను చూపించగా ఎండపల్లి, బీమారం మండలాలను గుర్తించి ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. బండలింగాపూర్‌ను మండలంగా ప్రకటించినా ఇంతవరకు మండల ఏర్పాటుకు చర్యలు చేపట్టలేదు. గత ఎన్నికల్లో జిల్లాలో 380 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరపగా తదుపరి పెద్దపల్లి జిల్లా నుంచి కొన్ని జీపీలను జగిత్యాల జిల్లాకు మార్చారు. ఇటీవల కొన్ని జీపీలను నూతనంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నా ఓటర్ల జాబితాలో ప్రస్తుతం 382 గ్రామ పంచాయతీలు, 3,512 వార్డులను ప్రకటించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వరకు మండలాలు, జీపీలు, వార్డులసంఖ్య మారే అవకాశముండగా తదుపరి ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికల వరకు నూతన మండలాలకు తప్పనిసరిగా వేరువేరుగా గుర్తించాల్సి ఉంటుంది. గతంలో రెండు దఫాలకు కేటాయించిన రిజర్వేషన్లు ప్రస్తుత ఎన్నికలకు వర్తింపజేస్తారా లేదా కులగణన జరిపి నూతనంగా రిజర్వేషన్లు ఖరారు చేస్తారా అనేది తేలాల్సి ఉంది. ఓటర్ల జాబితా వెలువడటంతో పోటీ చేసేందుకు ఆశావహులు సిద్ధమవుతుండగా అధికారులు ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో ఇటీవలి జాబితా ప్రకారం ఓటర్లు ఇలా..

మండలం	జీపీలు	వార్డులు	పురుషులు	స్త్రీలు
బీర్‌పూర్	17	136	8,272	9,072
బుగ్గారం	11	104	8,794	9,252
ధర్మపురి	25	224	16,848	17,875
గొల్లపల్లి	27	246	18,732	20,104
ఇబ్రహీంపట్నం	17	162	14,296	16,566
జగిత్యాల రూరల్	29	268	21,449	23,481
జగిత్యాల	5	50	4,476	4,983
కథలాపూర్	19	188	17,430	19,545
కొడిమ్యాల	24	216	18,468	19,626
కోరుట్ల	15	152	14,579	16,259
మల్యాల	19	186	18,733	20,713
మల్లాపూర్	23	220	19,007	21,509
మేడిపల్లి	25	238	19,387	21,846
మెట్‌పల్లి	23	212	16,967	19,250
పెగడపల్లి	23	216	17,080	18,182
రాయికల్	32	276	18,314	20,603
సారంగాపూర్	18	144	9,572	10,456
వెల్గటూరు	30	274	20,606	21,200



దృశ్య సమీక్షలో అదనపు కలెక్టర్, అధికారులు

ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం

జగిత్యాల, న్యూస్‌టుడే: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం కల్పించాలని ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో దృశ్య సమీక్ష నిర్వహించారు. ఓటరు నమోదుపై నిబంధనల ప్రకారం ఈ నెల 16, 25న నోటీసు జారీ చేయాలని.. నవంబర్ 6లోపు ఓటరుగా నమోదు అవకాశముందన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి సమీక్షలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

282 మంది ఉపాధ్యాయుల ఎంపిక

జగిత్యాల: డీఎస్సీలో జిల్లాలో 282 ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. జిల్లాలో 334 ఖాళీలుండగా 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. అందులో మెరిట్ ప్రకారం 760 మందిని అర్హులుగా గుర్తించగా 734 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం మెరిట్, రోస్టర్ ప్రకారం 282 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఎంపికైన వారిలో 101 మంది స్కూల్ అసిస్టెంట్లు, 143 మంది ఎస్జీటీలు, 31 మంది భాషా పండితులు, ఏడుగురు పీఈటీలున్నారు. వారందరికి మంగళవారం రాత్రి నియామక ఉత్తర్వులు తయారు చేశారు. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందించనున్నారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్ వెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేశారు.

బీటులో దినుసుల కొనుగోలు

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం రైతులు 976 క్వింటాళ్ల మక్కలను రైతులు విక్రయించగా క్వింటాలుకు కనిష్ఠంగా రూ.1,600 నుంచి గరిష్ఠంగా 2,411 వరకు ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి టి.రాజశేఖర్ తెలిపారు. ఎంటీయూ 1010 రకం ధాన్యం రూ.1,730, బీపీటీ రూ.1,907 చొప్పున ధరలు పలికినట్లు పేర్కొన్నారు.

ఆపద్బాంధవులు ఈ జాలర్లు

న్యూస్‌టుడే, ధర్మపురి

ప్రాణాలకు తెగించి సాయం



వంతెన కింద గుడిసెల్లోనే జాలర్ల నివాసం

జిల్లాలోని రాయపట్నం గోదావరి తీరంలో స్నానాలు చేసేందుకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తూ.. లోతు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమయంలో క్షణాల్లోనే వీరిని అక్కడున్న జాలర్లు ప్రాణాలకు తెగించి కాపాడుతున్నారు. ఇటీవల రాయపట్నం వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురు కొట్టుకుపోగా.. వారిలో ఇద్దరిని ప్రాణాలకు తెగించి కాపాడారు. ఇలా రాయపట్నం వద్ద చేపలను పట్టే మత్స్య కార్మికులు ప్రాణ రక్షకులుగా నిలిచారు.

ప్రమాద సూచికలు లేకపోవడంతో..

ఇక్కడ ఎల్లంపల్లి నిలువ నీరు భారీగా ఉంటోంది. దీంతో పురాతన వంతెన ఎప్పుడూ మునిగి ఉంటుంది. ప్రమాద సూచికల బోర్డులు లేకపోవడంతో నేరుగా నదిలోకి స్నానానికి దిగుతున్నారు. లోతు భారీగా ఉండటంతో వరద నీటి ప్రవాహంలో కొట్టుకుని పోతున్నారు. ఇప్పటివరకు 50 మందికిపైగా రక్షించామని చెబుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వచ్చి..

కృష్ణా జిల్లా కైకలూరు ప్రాంతానికి చెందిన 12 కుటుంబాల మత్స్య కార్మికులు.. ముప్పై ఏళ్ల కిందట ఉపాధి కోసం రాయపట్నానికి వలస వచ్చారు. నదీ తీరంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. మరోవైపు రాయపట్నం వద్ద వంతెన నుంచి నీటిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన వారిని క్షణాల్లోనే వారి ప్రాణాలు కాపాడుతున్నారు. ఇప్పటివరకు సుమారుగా పదేళ్లలో 50 మంది ప్రాణాలను కాపాడారు. నిండు గోదావరిలో అవలీలగా ఈతకొట్టే సామర్థ్యం కలిగి ఉన్న ఈ మత్స్య కార్మికులు.. ఈ ఏడాదిలో 5 గురుని కాపాడారు.

ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి



జాలరులైన తమకు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఇక్కడ ఏ ఘటన జరిగినా వెంటనే రక్షిస్తున్నాం. ప్రమాదవశాత్తు ఇటీవల ప్రవాహంలో కొట్టుకుపోయిన ఇద్దరు యువకులను కాపాడాం. నదిలో దూకి ఆత్మహత్యయత్నం చేసుకున్న వారిని క్షేమంగా తీరానికి తీసుకువచ్చిన ఘటనలున్నాయి. ప్రభుత్వం తమకు గృహ నిర్మాణంతోపాటు సరిపడా ఉపాధి కల్పించాలి.

- వేణుకుమార్, మత్స్య కార్మికుడు, రాయపట్నం

పలువురి ప్రాణాలను కాపాడాం



మాది కృష్ణా జిల్లా కైకలూరు. 35 ఏళ్ల కిందట రాయపట్నం వచ్చాం. ప్రమాదకర పరిస్థితుల్లో పలువురి ప్రాణాలను కాపాడాం. ఏ చిన్న ప్రమాదం జరిగినా పోలీసులకు సమాచారం అందిస్తూ.. రక్షణ చర్యలు చేపడుతున్నాం. మాకు ఆధార్, ఓటు హక్కులు ఉన్నాయి. ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చి ఆదుకోవాలి. **- కోటయ్య, మత్స్య కార్మికుడు**



ఈజీఎస్ సిబ్బందిని వివరాలు అడుగుతున్న అధికారులు

ఉపాధి హామీలో అవకతవకలు

మల్లాపూర్, న్యూస్‌టుడే: మల్లాపూర్ మండలంలో 14వ విడత నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.2.17 లక్షల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించి రికవరీకి ఆదేశించినట్లు ఎంపీడీవో జగదీశ్ తెలిపారు. మల్లాపూర్ మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ వేదికలో మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన 2023 ఏప్రిల్ నుంచి ఏడాదిపాటు చేపట్టిన ఉపాధి హామీ పనులపై తనిఖీలు నిర్వహించారు. కొన్నిచోట్ల ఒకే కుటుంబానికి రెండు చొప్పున జాబ్ కార్డులు ఇవ్వడంపై సిబ్బందిని అధికారులు మందలించారు. మస్టర్‌లలో సంతకాలు సరిగా లేకపోవడంతో కూలీలకు సకాలంలో డబ్బులు అందలేదని సిబ్బంది గుర్తించారు. కార్యక్రమంలో ఏపీడీ మదన్‌మోహన్, అంబుసిడమ్ కృష్ణరెడ్డి, డీవీవో చిన్నయ్య, జేవీవో దేవేందర్, ఎస్ఆర్‌పీ సాలయ్య, ఏపీవో సతీశ్, టీఏలు సుధాకర్, సరిత, ఈసీ సాయికుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లపై విప్ సమీక్ష

వెల్గటూరు, న్యూస్‌టుడే: పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో నియోజకవర్గస్థాయి అధికారుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్లు శేఖర్, రవికాంత్, ఎంపీడీవో విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసం.. కొత్త రూపం

అధికారులమని బెదిరిస్తూ డబ్బు స్వాహా

న్యూస్‌టుడే, గోదావరిఖని

లింకు క్లిక్ చేస్తే డబ్బులు మాయం.. కొత్త యాప్‌లు తెరిస్తే ఖాతా నుంచి డబ్బు బదిలీ.. 'వ్యాపారంలో పెట్టుబడి పెట్టండి.. రెండింతల ఆదాయం పొందండి' అంటూ ప్రచారంతో మోసం.. 'మీ చరవాణి నంబర్ లక్కీ డ్రాకు ఎంపికైంది కొంత డబ్బు చెల్లిస్తే బంగారు ఆభరణం మీ చేతికి వస్తుంది' అంటూ దగా..

ఇలా సైబర్ నేరగాళ్లు పలు రకాల మోసాలతో అమాయకులను గతంలో బురిడీ కొట్టించారు.. పాత నేరాలపై అవగాహన పెరిగి జనం జాగ్రత్త పడుతుండటంతో కొత్త రూపాలెత్తుతున్నారు.. తాజాగా పోలీసుల అవతారమెత్తి మోసాలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో రూ.15.82 కోట్లను సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి కొల్లగొట్టారు. కొత్త కొత్త రూపాల్లో వస్తున్న సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉంటేనే సొమ్ము భద్రంగా ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా డబ్బు క్షణాల్లో వారి చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉంది.


ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు..

నమోదైన కేసులు : 1,788

సైబర్ నేరగాళ్లకు బదిలీ అయిన డబ్బు : రూ. 19,29,51,036

సకాలంలో స్పందించడంతో బదిలీ కాకుండా ఆపగలిగింది : రూ. 3,46,81,599

మోసం ద్వారా జనం నష్టపోయిన మొత్తం : రూ. 15,82,69,437



డబ్బు పోయిందా.. తిరిగి రాదు

గుర్తు తెలియని వ్యక్తి బెదిరించగానే చెప్పిన ఖాతాకు డబ్బులు పంపిస్తున్నారు. ఒక్కసారి డబ్బు వారి ఖాతాలోకి చేరిందంటే తిరిగి రావడమంటూ ఉండదు. ఒకవేళ మోసపోయినా గంటలోపు గుర్తించి 1930కు సమాచారం అందిస్తే 90 శాతం సొమ్మును బదిలీ కాకుండా సైబర్ క్రైం పోలీసులు ఆపగలుగుతారు. ఆలస్యమైన కొద్దీ నిలువరించే శాతం తగ్గుతుంది.

ఉమ్మడి జిల్లాలో తాజా మోసాలిలా

- నీ మీద మనీ లాండరింగ్ కేసు నమోదైంది. మేము ముంబయి పోలీసులం. కేసు లేకుండా ఉండాలంటే మేము చెప్పిన బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేయాలి.
- మేము సీబీఐ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాం. మీపై కేసు నమోదైంది. అరెస్టు చేయకుండా ఉండాలంటే చెప్పిన బ్యాంకు ఖాతాలో డబ్బు వేయాలి. లేదంటే విచారణ కోసం సీబీఐ కార్యాలయానికి తీసుకెళ్తాం.
- దిల్లీ పోలీసులం మాట్లాడుతున్నాం. గంజాయి రవాణా చేస్తుండగా మీ అబ్బాయి పట్టుబడ్డాడు. వెంటనే డబ్బు పంపిస్తే వదిలేస్తాం.
- అక్రమ లావాదేవీలపై విచారణ చేస్తున్నాం. అందులో మీ ప్రమేయమున్నట్లు అనుమానం ఉంది. విచారణ కోసం సెక్యూరిటీ డిపాజిట్ చేయాలి. అందులో మీ ప్రమేయం లేదని తేలితే డబ్బు తిరిగిచ్చేస్తాం.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- చరవాణిలకు వచ్చే తెలియని లింకులను తెరవకూడదు.
- గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరించినా స్పందించకూడదు. పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- రుణాలు మంజూరయ్యాయంటే నమ్మకూడదు. అలాంటి యాప్‌ల జోలికి వెళ్లకూడదు.
- పోలీసులమని ఫోన్ చేసే వ్యక్తుల మాటలను నమ్మకండి. వారు సరైనవారా కాదా అని నిర్ధారించుకోండి. అవసరమైతే మీ పరిధిలో ఉన్న పోలీసులకు తెలియజేయండి.
- ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో కూడా సైబర్ నేరగాళ్లు యాప్‌లను పంపిస్తుంటారు. పెట్టుబడి పెడితే రెండింతలవుతుందని నమ్మిస్తారు. వీటిపై కూడా జాగ్రత్తగా ఉండాలి.

ప్రజల సహకారం అవసరం

సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయినా ప్రజలు మోసగాళ్ల వలలో పడుతున్నారు. కొత్త కొత్త రూపాల్లో సైబర్ నేరగాళ్లు వస్తున్నారు. అప్రమత్తతతో గుర్తించాలి.

- వెంకటరమణ, రామగుండం సైబర్‌క్రైం ఏసీపీ

డెంగీ నిర్ధారణ పరీక్షల్లో జిల్లా ప్రథమం



మాట్లాడుతున్న షమియొద్దీన్

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్లే సీజనల్ వ్యాధులను నియంత్రించగలిగామని జిల్లా వైద్యాధికారి షమియొద్దీన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జన ఆరోగ్య సమితిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల అనుబంధ శాఖల సహకారంతో వైద్యులు, సిబ్బంది నిరంతరం కృషి చేయడంతో వ్యాధులను అరికట్టగలిగామన్నారు. డెంగీ నిర్ధారణ పరీక్షల్లో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని షమియొద్దీన్ అన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాలకు వార్షిక నిధుల కేటాయింపు జరిపారు. వినియోగంపై దిశానిర్దేశం చేశారు. ఉప వైద్యాధికారి డాక్టర్, శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అర్చన, డాక్టర్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వవ్యాప్తం.. బతుకమ్మ సంబరం

తీరొక్క పూలతో సంస్కృతీ సంప్రదాయాలను పూయిస్తున్న బతుకమ్మ.. కొన్నేళ్లుగా విశ్వవ్యాప్తంగా సందడి చేస్తోంది. మన పండగ అనే భావనతో వివిధ దేశాల్లో స్థిరపడిన వారంతా పోటీపడి వేడుకలు నిర్వహిస్తున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా కార్యక్రమాల్లో పాల్గొంటుండగా ఆసక్తికరమైన పోటీలు నిర్వహిస్తూ ఈ పండగకు నిర్వాహకులు వన్నె తెస్తున్నారు. రాష్ట్రం నుంచి రాజకీయ నాయకులు, సినీతారలు, బుల్లితెర నటులు, ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల అధికారులు, వివిధ దేశాల ప్రజాప్రతినిధులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటున్నారు.

న్యూస్‌టుడే, మేడిపల్లి



ఎడారి దేశాల్లో పూల సందడి

గల్ఫ్ దేశాల్లో బతుకమ్మ వేడుకలకు విశేష స్పందన వస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ఆయా దేశాలకు వెళ్లిన వారికి ఈ వేడుకలు ఆనందాన్నిస్తున్నాయి. దుబాయిలో గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 17 ఏళ్లుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 6న.. ఇండియన్ పీపుల్స్ ఫోరం ఆధ్వర్యంలో అక్టోబరు 5న సంబరాలు జరిపారు. గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్‌లో చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన జువ్వాడి శ్రీనివాస్‌రావు, మంథనికి చెందిన శ్రీనివాస్ శర్మ, జగిత్యాలకు చెందిన మెట్ట రమేశ్‌చంద్ర, సలావుద్దీన్, మేడిపల్లికి చెందిన దామెర సామ్యూల్ పండగ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీచర కిరణ్‌కుమార్ బోయినపల్లి మండలం వర్దవెల్లికి చెందిన వారు కాగా ప్రస్తుత అధ్యక్షుడు రాధారపు సత్యం సిరిసిల్ల వాస్తవ్యులు. ఇండియన్ పీపుల్స్ ఫోరంలో మేడిపల్లి మండలం తొంబర్రావుపేటకు చెందిన గంగారాం సభ్యుడిగా ఉన్నారు. దుబాయి సహా బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతర్ తదితర గల్ఫ్ దేశాల్లోనూ పూల పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.



దుబాయిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అంబరాన్నంటేలా..

అమెరికాలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 5న వైభవంగా పండగ జరిపారు. పెద్దపల్లికి చెందిన విశ్వేశ్వర్‌రెడ్డి కల్వల ఈ సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు. న్యూవింగ్టన్‌లో ఈ నెల 6న తెలంగాణ ఎన్నారై అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరగగా.. డల్లాస్, చికాగోలోనూ కార్యక్రమాలు నిర్వహించారు. న్యూజెర్సీలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో 20వ సారి.. ఫ్లోరిడాలోని టాంపా నగరంలో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న వేడుకలు జరిగాయి. అమెరికాతోపాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్, మలేషియా, యూకే తదితర దేశాల్లో కొన్ని ప్రాంతాల్లో వేడుకలు పూర్తి కాగా మరి కొన్ని ప్రాంతాల్లో జరగనున్నాయి.



అమెరికాలో వేడుకలకు హాజరైన అతివలు

వేడుకలకు అతిథులు

దుబాయిలో జరిగిన వేడుకలకు మంత్రి జూపల్లి క్రిష్ణారావు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. సినీనటి అనన్య, జానపద గాయని వరం, బుల్లితెర హాస్యనటుడు సదన్న, భారత రాయబార కార్యాలయం నుంచి బిజేందర్ సింగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమెరికాలో వేడుకలకు మంత్రి జూపల్లి క్రిష్ణారావు హాజరయ్యారు. అమెరికా సహా వివిధ దేశాలకు తెలంగాణకు చెందిన పలువురు సినీనటులు, బుల్లితెర నటులు, వ్యాఖ్యాతలు, గాయనీ గాయకులు, సినీ ప్రముఖులు హాజరవుతూ బతుకమ్మ వేడుకలకు వన్నె తెస్తున్నారు.

ఊరిలో ఉన్నట్టుగానే ఉంది



ఈటీసీఏ ఆధ్వర్యంలో ఏటా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నాం. మహిళా విభాగం ఈ వేడుకల నిర్వహణలో చురుకుగా పాల్గొంటోంది. ఈసారి వేడుకలకు 5 వేల మంది వరకు హాజరయ్యారు. ఇక్కడి వాతావరణం చూస్తుంటే మా గ్రామంలో ఉన్నట్లే అనిపిస్తోంది. ఆటపాటలతో మహిళలు, చిన్నారుల సందడి పండగకు వన్నె తెచ్చింది. ఏటా ఇలాగే కార్యక్రమాలు నిర్వహించాలని ఈటీసీఏ భావిస్తోంది. **- రాణి కోట్ల, దుబాయి**

ఆకట్టుకున్న పండగ



దుబాయిలో బతుకమ్మ వేడుకలు ఆకట్టుకున్నాయి. ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కుటుంబ సభ్యులతో వేడుకల్లో పాల్గొన్నారు. దసరా ముందర ఈ పండగ అందరిలో హుషారు నింపింది. ఎడారి దీవుల పక్కన పూలతో చేసుకునే పండగ ఇక్కడి వారు కూడా ఆస్వాదించారు. రాష్ట్రం నుంచి వచ్చిన పలువురు వారి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. **- మౌనిక గుండవేని, దుబాయి**

ఐరావతంపై నారసింహుడి ఊరేగింపు



ధర్మపురి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐరావతం (ఏనుగు)పై ఉత్సవ మూర్తులను ఆసీనులను చేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం నుంచి సేవను పుర వీధుల్లో స్వామివారి శోభాయాత్ర ఘనంగా ఊరేగించారు. ఈవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సొంతానికి ఎక్కువ.. ఆర్థికాభ్యున్నతికి తక్కువ

మహిళా రుణాల వినియోగం తీరిది ● నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



న్యూస్‌టుడే, కరీంనగర్ సంక్షేమ విభాగం

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు బ్యాంకు లింకేజీతో రుణాలు అందజేస్తున్నారు. గతేడాది విధించిన లక్ష్యం చేరుకోవడంతో.. రాష్ట్రస్థాయిలో అవార్డు సైతం సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం 2024-25 లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. రుణాలు తీసుకున్న వారిలో అతికొద్ది మాత్రమే వ్యాపారానికి ఉపయోగించుకొని ఆర్థికాభ్యున్నతి పొందుతున్నారు. ఎక్కువ శాతం మంది సొంత అవసరాలకే వినియోగిస్తున్నారు. వారిలో అవగాహన పెంచాల్సిన ఆవశ్యకతపై 'న్యూస్‌టుడే' కథనం.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలకు ఏటా మంజూరు చేసిన రుణాన్ని.. సొంతానికి వినియోగించుకున్న అప్పులు చెల్లించడం, ఇతరాత్ర వాటికే మహిళలు ఉపయోగించుకుంటున్నారు. సొంతంగా ఏదైనా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ఆలోచన చేయడంలేదు. అతి కొద్దిమంది మాత్రమే చిన్నపాటి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో మహిళలు పురోగతి సాధించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంజూరు చేసిన రుణమొత్తానికి ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాల వారీగా ఈ ఆర్థిక సంవత్సరం వివరాలు

జిల్లా	సంఘాలు	రుణ లక్ష్యం (రూ.లక్షల్లో)
కరీంనగర్	11,083	77,125.34
రాజన్న సిరిసిల్ల	8,007	53,319.00
పెద్దపల్లి	9,101	47,796.95
జగిత్యాల	12,636	76,563.63

అవగాహన అవసరం

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని వ్యాపారాలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. వారందరూ రుణాలు తీసుకునేలా ఏటా లక్ష్యాన్ని విధిస్తోంది. అధికారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షలకుపైగా సభ్యురాళ్లకు రుణాలు మంజూరు చేస్తే.. అందులో కనీసం వందల్లో కూడా ఆర్థికంగా రాణిస్తున్న వారు లేకపోవడం విశేషం. ప్రస్తుతం పలు సంఘాలు ఏటా రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం తీసుకుంటున్నాయి.

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం

మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించడానికి ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి ద్వారా సొంతంగా వ్యాపారాలు నిర్వహించేలా తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వ్యాపారాలు ప్రారంభించి లాభాన్ని అర్జించేలా అధికారులు సూచనలు చేస్తూ పర్యవేక్షించేలా చూస్తాం.

- శ్రీధర్, కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

ఆధ్యాత్మిక పర్యాటకం.. అభివృద్ధికి అవకాశం

ఉమ్మడి జిల్లాలో సర్క్యూట్ ఏర్పాటుకు సన్నాహాలు

న్యూస్‌టుడే, ధర్మపురి



ధర్మపురి దేవస్థానం

పర్యాటక, దేవాదాయశాఖల ఆధ్వర్యంలో రాష్ట్రంలో మూడు సర్క్యూట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాల్లో ఆధ్యాత్మికతను వెదజల్లుతూనే.. పర్యాటకంగా భక్తులను ఆకర్షించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో ఈ కేంద్రాలు మరింత అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు.

● చరిత్రాత్మక ఆలయాలు..

☛ జగిత్యాల జిల్లాలోని చారిత్రక ప్రాధాన్యత కలిగి శాతవాహనుల రాజధానిగా వెలుగొందిన కోటిలింగాలలోని కోటి లింగేశ్వరస్వామి ఆలయం భక్తులను ఆకర్షిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని తొమ్మిది నృసింహ క్షేత్రాల్లో ఒకటిగా పూజలందుకున్న ధర్మపురి క్షేత్రం.. భక్తుల కొంగు బంగారమైంది.

☛ జిల్లా సరిహద్దున గల రాయపట్నం వద్ద పురాతన, నూతన వారధుల ప్రదేశం, ఎల్లంపల్లి నిలువ నీటి ప్రదేశాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికే వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల వద్ద ఏర్పాటుచేసిన బోటింగు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

☛ ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం దక్షిణ కాశీగా చారిత్రాత్మక ప్రాధాన్యతను పొంది, భక్తులకు పెన్నిధిగా మారింది. లక్షలాది మంది హనుమాన్ భక్తులతో నిండిన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం విశేష ప్రాచుర్యాన్ని పొందింది.

● ప్రణాళికల రూపకల్పన..

గత నెలలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యార్, కమిషనర్ హన్మంతరావులతోపాటు, దేవస్థానాలకు చెందిన అధికారులు సమావేశమయ్యారు. ఆలయాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మాస్టర్ ప్లాన్లు, భక్తులకు వీఐపీ దర్శన సౌకర్యాల కల్పనలపై సుదీర్ఘంగా చర్చించారు. దేవస్థానాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై, భక్తులకు వసతులతోపాటు, ఆయా కేంద్రాల్లో పర్యాటకపరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఓ వైపు పర్యాటకపరంగా ఏఏ పనులు ఇంతకుముందు ప్రతిపాదించారు? ఇంకా ఏ పనులు చేపట్టాల్సి ఉంది? నిధులు ఎన్ని అవసరమవుతాయనే విషయంపై చర్చించనున్నారు.

☛ ఇంతటి ప్రాధాన్యతలు, విశేషాలు ఉన్న ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాలను కలిపి మొదటి సర్క్యూట్‌గా ఏర్పాటుచేసి, పర్యాటక, దేవాలయాల పరంగా అభివృద్ధి పరచే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఎస్సారెస్పీకి 34 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం వరకు 34,086 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా 4 స్పిల్‌వే గేట్ల ద్వారా 12,496 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1,200 క్యూసెక్కులు, మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. వరద కాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. కాకతీయ కాలువ, విద్యుత్తు ఉత్పత్తికి 6,800, లక్ష్మీ కాలువకు 150, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉంది.

బడితండా వాసికి బంగారు పతకం



పతకంతో అనిల్

రుద్రంగి, న్యూస్‌టుడే: గోవాలో ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా యూత్ గేమ్స్ 800 మీటర్ల పరుగు పోటీలో రుద్రంగి మండలం బడితండాకు చెందిన మాలోత్ అనిల్ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. ఇటీవల జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు కూడా అనిల్ ఎంపికయ్యాడు. ప్రస్తుతం అనిల్ కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాడు. వివిధ క్రీడల్లో రాణిస్తున్న యువకుడిని మండలానికి చెందిన పలువురు అభినందించారు.

హత్యాయత్నం కేసులో రెండేళ్ల జైలు



జగిత్యాల, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో ఒకరికి జగిత్యాల న్యాయస్థానం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. బుగ్గారం మండలం గోపులాపూర్‌లో రొండి మాణిక్యం అలియాస్ సంతోశ్.. తన అన్న రొండి రవీందర్ మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. రవీందర్ భార్య సుజాత మంత్రాలు చేయడం వల్లే తన భార్యాపిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని భావించి మాణిక్యం కోపం పెంచుకున్నాడు. 2018 ఫిబ్రవరి 21న కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో రవీందర్ ఇంట్లోకి చొరబడిన మాణిక్యం.. తన వదిన సుజాతపై దాడి చేసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. బుగ్గారం పోలీసులు కేసు నమోదు చేసి మాణిక్యంను రిమాండ్‌కు పంపించగా ఎస్సైలు మధూకర్, రవీందర్‌లు కేసు దర్యాప్తు చేశారు. కోర్టు విధుల అధికారులు రాజునాయక్, శ్రీధర్, కిరణ్‌లు సాక్ష్యాధారాలు అందించగా ప్రాసిక్యూషన్ తరపున అదనపు పీపీ సాయిల్ల మురళి వాదించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.ప్రసాద్.. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. శిక్ష పడటానికి చొరవ చూపిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

మేయర్‌పై అట్రాసిటీ కేసు నమోదు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ వై.సునీల్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత ఫిర్యాదు ఆధారంగా కోర్టు ఆదేశాలతో పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. తన డివిజన్‌లో జరగాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు కేటాయించాలని గతంలో మేయర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించానని.. ఆ సమయంలో కులం పేరుతో దూషించారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డివిజన్‌కు దురుద్దేశపూర్వకంగానే నిధులు ఇవ్వడంలేదని రెండు సార్లు పోలీసుస్టేషన్‌లో కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారని కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో వాస్తవాలని ధ్రువీకరించేందుకు పోలీసులు త్వరలో విచారణ చేపట్టనున్నారు.

గొలుసు చోరీ నిందితుల అరెస్టు




తెలంగాణచౌక్ (కరీంనగర్): గొలుసు దొంగతనాలకు (చైన్‌స్నాచింగ్) పాల్పడుతున్న నిందితులను పట్టుకున్నామని రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. ఏసీపీ తెలిపిన ప్రకారం.. ఎడవెల్లి దీపక్, చందు అనే యువకులు జల్సాలకు అలవాటుపడ్డారు. కరీంనగర్‌లోని పలు శివారు ప్రాంతాల్లో ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకొని ద్విచక్రవాహనంపై వచ్చి బంగారు గొలుసులు చోరీ చేసేవారు. మంగళవారం తీగలగుట్టపల్లిలో పోలీసులు తనిఖీ చేస్తున్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకున్నారు. నిందితుల నుంచి బంగారాన్ని కొన్న షాప్ యజమాని సింహరాజు నరేష్‌నూ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 105.85 గ్రాముల బంగారం రికవరీ చేశారు. స్కూటీతోపాటు బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్సై ఎ.లక్ష్మారెడ్డి, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

కాజీపేట నుంచి దాదర్‌కు రెండు ప్రత్యేక రైళ్లు




పెద్దపల్లి, న్యూస్‌టుడే: కాజీపేట, దాదర్ మధ్య నవంబరు నుంచి రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మొదటి రైలు కాజీపేట నుంచి నవంబరు 27 నుంచి జనవరి 29 వరకు ప్రతి బుధవారం నడుస్తుంది. తిరిగి ఇదే రైలు దాదర్ నుంచి నవంబర్ 28 నుంచి జనవరి 30 వరకు ప్రతి గురువారం బయల్దేరుతుంది. రెండో ప్రత్యేక రైలు నవంబర్ 30 నుంచి జనవరి 25 వరకు ప్రతి శనివారం కాజీపేట నుంచి దాదర్‌కు, డిసెంబర్ 1 నుంచి జనవరి 26 వరకు ప్రతి ఆదివారం దాదర్ నుంచి నడుస్తుంది. రెండు రైళ్లు ఉమ్మడి జిల్లాలోని జమ్మికుంట, పెద్దపల్లి, కరీంనగర్, లింగంపల్లి(జగిత్యాల), కోరుట్ల, మెట్‌పల్లి స్టేషన్లలో ఆగుతాయి. ఇక్కడి నుంచి బాసర వెళ్లే భక్తులకు ఈ రైళ్లు అనుకూలంగా ఉంటాయి.

మద్దతు ధరపైనే ఆశలు



పత్తి కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు



జమ్మికుంట మార్కెట్ యార్డులో ఆరబెట్టిన కొత్తపత్తి

ఉమ్మడి జిల్లాలో సీజన్‌కు ముందు నుంచే కొత్తపత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. పాత పత్తి విక్రయాలు తగ్గిపోగా.. క్రమేణా కొత్తపత్తి విక్రయాలు పెరుగుతున్నాయి. గత నెల 13 నుంచి జమ్మికుంట ప్రధాన వ్యవసాయ మార్కెట్‌కు కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. వరంగల్, కేసముద్రం, ఖమ్మం మార్కెట్లలోనూ కొత్తపత్తి విక్రయాలు ప్రారంభమయ్యాయి. – న్యూస్‌టుడే, జమ్మికుంట

క్వింటాకు రూ.7,521

■ కేంద్ర ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. ఇది ఈ నెల 1 నుంచి అమలులోకి రానుంది.

■ పింజ పొడవును బట్టి మధ్యస్థ పత్తికి రూ.7,121గా నిర్ణయించింది.

■ వరంగల్ రీజియన్ మార్కెటింగ్ పరిధిలో నాలుగు వ్యవసాయ మార్కెట్లకు కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు.

■ జమ్మికుంటలో కొనుగోళ్ల మొదటి రోజు రూ.7,119ల ధర పలికింది.

■ మార్కెట్‌లో సుమారు 17 రోజుల్లో సుమారు 800 క్వింటాళ్ల కొత్త పత్తి కొనుగోళ్లు జరిగాయి.

■ కొత్తపత్తి విక్రయాలు దసరా అనంతరం జోరు అందుకోనున్నాయి.

■ రానున్న రోజుల్లో ఎక్కువ మొత్తంలో పత్తి విక్రయానికి వచ్చే అవకాశం ఉన్నందున మద్దతు ధర కోల్పోకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

■ ప్రస్తుతం కొత్తపత్తితోపాటు నామమాత్రంగా వస్తున్న పాతపత్తిని ద్వితీయ శ్రేణి వ్యాపారులే ఖరీదు చేస్తున్నారు. అధిక తేమ శాతం, నాణ్యత లేని పత్తిని ఖరీదు చేసి యార్డులో, గిడ్డంగులు, షాపుల వద్ద ఆరబెడుతున్నారు.

■ మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు వీలుగా తేమశాతం ఎక్కువ ఉన్న పత్తిని ఆరబెట్టడంపై ద్వితీయశ్రేణి వ్యాపారులు దృష్టి సారించారు.

■ ప్రస్తుతం జిన్నింగ్ మిల్లుల్లో యంత్రాల మరమ్మతు పనులు చేపట్టామని.. దసరా తర్వాతే మిల్లుల్లో కొత్తసీజన్‌లో కొనుగోళ్లు చేపడతామని మిల్లుల వ్యాపారులు చెబుతున్నారు.

తేమ లేకుండా చూడాలి



జమ్మికుంట మార్కెట్‌లో కొత్తపత్తి విక్రయాలు క్రమేణా పెరిగాయి. పత్తి ఏరగానే నేరుగా విక్రయానికి తీసుకొస్తున్నారు. దీంతో తేమ శాతం ఎక్కువ ఉంటోంది. ఈ కారణంగా ధర తగ్గుతుంది. రైతులు పత్తిని ఆరబెట్టి పెట్టి విక్రయానికి తీసుకురావాలి. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నిబంధనలు ఇంకా అధికారుల నుంచి రాలేదు.

- ఆర్.మల్లేశం, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్, జమ్మికుంట

మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు ప్రకటించామని ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం తెలిపారు. పండగల అనంతరం సోమవారం మార్కెట్ నిర్వహణ ఉంటుందని రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించాలని ఆయన కోరారు.

తగ్గిన విక్రయాలు

మంగళవారం మార్కెట్‌లో కొత్తపత్తి విక్రయాలు తగ్గాయి. యార్డుకు 45 ట్రాలీల విడిపత్తి రాగా.. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.6,650 ధర పలికింది. 65 క్వింటాళ్ల బస్తాల పత్తిని రూ.5,900-6,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. పాత పత్తి విక్రయానికి రాలేదని మార్కెట్ అధికారులు తెలిపారు. సోమవారం కంటే తాజాగా పత్తి ధర రూ.150 తగ్గింది. తేమ అధికంగా ఉండటం, నాణ్యత లేకపోవటంతో ధర తగ్గిందని వ్యాపారులు అంటున్నారు.

అలరించిన ర్యాలీ

జగిత్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలో డీవైఎస్‌వో ఆధ్వర్యంలో మంగళవారం సీఎం కప్ టార్చ్ ర్యాలీ నిర్వహించారు. టార్చ్ రిటే ర్యాలీని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య జెండా ఊపి ప్రారంభించారు. పొలాసలోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ కళాశాల మీదుగా శ్రీవివేకానంద మినీ స్టేడియం వరకు ర్యాలీ చేపట్టారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడల అభివృద్ధి కోసం చేస్తున్న కృషిలో భాగంగా సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో రవికుమార్, ప్రజాప్రతినిధులు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


ర్యాలీ ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

శుద్ధజలం అందించేలా చర్యలు

రాయికల్, న్యూస్‌టుడే: రాయికల్ మండలం చెర్లకొండాపూర్‌లో శుద్ధ జలాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాగా గ్రామస్థులు ఫ్లోరైడ్ నీటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్సీ నీటి సరఫరా చేసే బావిని పరిశీలించి.. నీటి పరీక్షలు చేయాలని సూచించారు. చెర్లకొండాపూర్‌లో నీటి సమస్యపై ఆయన జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. గ్రామంలో భగీరథ నీటిని అందించడానికి తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపి రాజరెడ్డి, తలారీ రాజేశ్, రాజేందర్, పల్లికొండ రమేశ్ తదితరులున్నారు.

పల్లె దవాఖానాతో మెరుగైన వైద్యం

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె దవాఖానాతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందనుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షలతో నిర్మించే పల్లె దవాఖానా భవన నిర్మాణానికి మంగళవారం ఆయన భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. నాణ్యమైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మాస్టర్ ప్లాన్ విషయంలో అపోహలు వద్దని.. రైతులకు అండగా ఉంటామన్నారు. అర్బన్ మండలం కేవలం 5 గ్రామాలతో చిన్నగా మారిందని.. రీ ఆర్గనైజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. జగిత్యాల మెడికల్ హబ్‌గా మారిందన్నారు. అనంతరం మండలంలోని హబ్సీపూర్‌లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ పంచాయతీకి స్థలాన్ని అందజేసిన దాత సుధాకర్‌రెడ్డిని సత్కరించారు.


తిప్పన్నపేటలో పల్లె దవాఖానాకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

పార్కు పనుల పరిశీలన

జగిత్యాల గ్రామీణం: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేటలో అటవీ ప్రాంతంలో నగర్ వన్ యోజన పథకంలో భాగంగా చేపట్టే అర్బన్ పార్కు పనులను జిల్లా అటవీ అధికారి మాదాసు రవిప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఎఫ్‌డీవో వాసవి, ఎఫ్‌ఎస్‌వో పద్మారావు, నాయకులు నక్కల రవీందర్‌రెడ్డి, గోడిసెల గంగాధర్, బొగిరి నారాయణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు ఇబ్బందులు ఉండొద్దు

కొడిమ్యాల, మల్యాల, న్యూస్‌టుడే: బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో గ్రామస్థులకు బతుకమ్మ తెప్ప, పూల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల, మల్యాల మండలాల్లో బతుకమ్మ తెప్పల వద్ద ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. అనంతరం హైమాస్ట్ విద్యుద్దీపాన్ని ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పది నెలల పాలనలో వికాసమేదీ?

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: పది నెలల కాంగ్రెస్ పాలనలో విధ్వంసమే తప్ప వికాసమే లేదని జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. రాయికల్‌లో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ, రైతు బంధు, ఆసరా పెన్షన్ పెంపు, కల్యాణలక్ష్మిలో తులం బంగారం, తదితరాలకు నిధుల లేవని పేర్కొంటున్న ప్రభుత్వం.. మూసీకి రూ.1.5 లక్షల కోట్లు ఎలా వెచ్చిస్తుందని ప్రశ్నించారు. భారాస పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్, కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, మహేందర్, స్పందన, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నర్సయ్య ఆశయ సాధనకు కృషి

మేడిపల్లి, న్యూస్‌టుడే: సీపీఐ నాయకుడు చింతకింది నర్సయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భాకపా నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం నర్సయ్య వర్ధంతి సందర్భంగా మేడిపల్లి మండలం కొండాపూర్‌లో ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్మికుల సమస్యలపై పోరాటం చేసిన మంచి వ్యక్తిగా పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. భాకపా మండల కార్యదర్శి మునుగూరి హన్మంతు, ఎదులాపురం గంగారాం, పిట్టల నారాయణ, గంగనర్సయ్య, సుతారి రాములు, దేవదాసు, పల్లి రాములు పాల్గొన్నారు.


నర్సయ్య వర్ధంతిలో సీపీఐ నాయకులు


ధర్మపురి: కాత్యాయని రూపంలో అమ్మవారు


జగిత్యాలలో గాజుల అలంకరణ


విద్యానగర్‌లో శాకంబరిగా..


నవదుర్గ క్షేత్రపీఠంలో..

దుర్గాదేవి.. నమోస్తుతే..!


రాయికల్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు

జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆయా మండపాల వద్ద మంగళవారం చండీ హోమం, నైవేద్యాలు, దీపారాధన, కుంకుమార్చనలు అన్నదానాలు నిర్వహించారు. అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. - న్యూస్‌టుడే, యంత్రాంగం


రాములపల్లిలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్


నేరెల్లలో చిన్నారులకు అక్షరాభ్యాసం


బీర్పూర్‌లో..


కొడిమ్యాలలో..


ధర్మపురి: సామూహిక కుంకుమ పూజలు


కుంకుమార్చనలు మెట్‌పల్లిలోని చైతన్యనగర్‌లో..


వీరాపూర్‌లో..


మల్యాలలో..

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

జగిత్యాల, న్యూస్‌టుడే యంత్రాంగం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించగా ఆయన సతీసమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళలకు బహుమతులు అందజేశారు. జగిత్యాల అంగడిబజార్‌లో పద్మశాలీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. పుర ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ భోగ శ్రావణి తదితరులు పాల్గొన్నారు. రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, ప్రజాప్రతినిధులు ఆడిపాడారు. మెట్‌పల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కొడిమ్యాలలో వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. కోరుట్లలో ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య, కౌన్సిలర్లు, మహిళా సంఘాల సభ్యులు మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. మెట్‌పల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బహుమతులు అందించారు.


జిల్లా పోలీసు కార్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో ఎస్పీ అశోక్‌కుమార్ దంపతులు

సింహ వాహనంపై చెన్నకేశవస్వామి

మెట్‌పల్లి పట్టణం: దేవీ శరన్నవ రాత్రుల్లో భాగంగా పట్టణంలోని శ్రీచెన్నకేశవస్వామి వారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి మంగళహారుతులిచ్చారు. పుర వీధులగుండా స్వామి వారి రథాన్ని ఊరేగించారు.



బ్రహ్మోత్సవాల్లో నృత్య ప్రదర్శన

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: కేరళలోని అనంత పద్మనాభస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మెట్‌పల్లి మీనాక్షి నృత్య కళా నిలయం విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. సోమవారం రాత్రి పద్మనాభస్వామి తులాభార మండపంలో విద్యార్థులు రిత్విక, గాయత్రి, శ్రీయాన్ష్, అక్షిత, అక్షర, హంసిక, శ్రీనిధి ప్రదర్శించిన నృత్యం అందరిని ఆకట్టుకుంది. అనంతరం నిర్వాహకులు నాట్య గురువు శ్రీవాణి, విద్యార్థులను జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. నృత్య కళా నిలయం గౌరవాధ్యక్షుడు గుర్రాల గంగాధర్, నునుగొండ నరేందర్‌లు ఉన్నారు.


ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులు

సరిహద్దు కూడలి.. సమస్యల ఝరి

రాయపట్నం కూడలి వద్ద ప్రయాణికులకు కనీస వసతులు కరవవుడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దసరా నేపథ్యంలో ప్రయాణికులతో కూడలి కిక్కిరిసి పోతోంది. నిలబడటానికి నీడ కరవై ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. గతంలో ఎన్టీపీసీ వారి సౌజన్యంతో నిర్మించిన బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరింది. రాయపట్నం నుంచి కరీంనగర్‌కు ఓ ప్రత్యేక షెటిల్ బస్సును నడిపించాలనే ప్రతిపాదనకూ మోక్షం కలగడం లేదు. మరోవైపు రహదారి కంకరలేచి ప్రమాదకరంగా మారింది. - న్యూస్‌టుడే, ధర్మపురి


రాయపట్నం వద్ద శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెగడపల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1992-1993 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. ఉపాధ్యాయులను సన్మానించి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.


1992-1993 బృంద పదో తరగతి విద్యార్థులు

సంక్షిప్తం

హిజ్రాలకు కౌన్సెలింగ్

మల్యాల: మల్యాల మండలంలోని కొండగట్టు పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న హిజ్రాలను మల్యాల ఎస్సై నరేశ్ మంగళవారం ఠాణాకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు వారిని ఠాణాకు పిలిపించినట్లు చెప్పారు. ఎవరినీ ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించి పంపినట్లు ఎస్సై వివరించారు.

ఎన్నిక

మెట్‌పల్లి: హైదరాబాద్‌లో మంగళవారం పీఆర్‌టీయూ టీఎస్ 35వ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గంలో మెట్‌పల్లి ప్రాంతానికి చెందిన పలువురు ఉపాధ్యాయులకు చోటు దక్కింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా బొమ్మెన చిన్నయ్య, మద్దిరాల గణేశ్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఎ. జయప్రద, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చింతకుంట వేణుగోపాల్, రాష్ట్ర కార్యదర్శులుగా గాజంగి నాగరాజు, నల్మాల లక్ష్మీనర్సయ్య, మోటూరి ప్రవీణ్, కె.నగేశ్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మల్లాపూర్, బీమారం: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా లక్కడి శ్రీనివాస్‌రెడ్డి, కుంబాల శ్రీనివాస్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. బీమారం మండలం గోవిందారం పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా మిట్టపల్లి రాజేందర్ రావు రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు.

పెగడపల్లి: పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యక్షునిగా మండలంలోని నంచర్లకు చెందిన లింగాల శంకర్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

విజయవంతం చేయాలి

మెట్‌పల్లి: బీసీ కుల గణన తక్షణమే చేపట్టాలని, రిజర్వేషన్లు 42 శాతం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మెట్‌పల్లిలో బుధవారం తలపెట్టిన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని సన్నాహక కమిటీ నాయకులు పుప్పాల లింబాద్రి, తొగిటి అంజయ్యలు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానికంగా మాట్లాడారు.

జగిత్యాల: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడిగా జగిత్యాలకు చెందిన చీటి భూపతి రావు నియమితులయ్యారు.

కరపత్రాల ఆవిష్కరణ

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో హిందూ ఐద్యవేదిక ఆధ్వర్యంలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని బుధవారం నిర్వహించే ర్యాలీకి పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు కోరారు. మంగళవారం కోరుట్లలో కరపత్రాలను ఆవిష్కరించారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య మంగళవారం ప్రారంభించారు. క్యాంటీన్ నిర్వహణతో మహిళలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. వైస్‌ఛైర్మన్ గడ్డమీది పవన్, కమిషన్ తిరుపతి, మెప్మా ఏవో శ్రీనివాస్, కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవాలి

మెట్‌పల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అండగా ఉండాల్సిన అవసరముందని తెలంగాణ జన సమితి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి అన్నారు. బెంగళూరులోని గాంధీభవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన లీడర్‌షిప్ మీట్ సదస్సులో ఆయన తెజస పార్టీ తరఫున వక్తగా పాల్గొని మాట్లాడారు. రైతు వ్యతిరేక చట్టాల విషయంలో కేంద్రం తన వైఖరి మార్చుకోవాలని సూచించారు.

భాజపా సభ్యత్వ నమోదు

కోరుట్ల: కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి మంగళవారం చేపట్టారు. పిడుగు ఆనంద్‌రెడ్డి, అల్లూరి బాపురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, స్వామి, మహేశ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.


బొమ్మెనలో సభ్యత్వం నమోదు చేయిస్తున్న కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలని నిరసన

మల్లాపూర్, న్యూస్‌టుడే: మల్లాపూర్ మండలం సిరిపూర్ సహకార సంఘంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఛైర్మన్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. సంఘం పరిధిలోని గత సీఈవో హయాంలో జరిగిన అవినీతి అక్రమాలకు సంబంధించి వేలం వేసిన భూములను రైతులకు అప్పగించడంతోపాటు సమస్యలను పరిష్కరించాలన్నారు. సంఘంలోని సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్‌లో కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు సీఈవో రాజేశ్వర్, డైరెక్టర్‌లు తెలిపారు.

రిలేదీక్ష సరికాదు

సిరిపూర్ సహకార సంఘంలో ఛైర్మన్ అంజిరెడ్డి రిలేదీక్ష చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మల్లాపూర్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భారాస ప్రభుత్వంలో చేసిన అవినీతిపై అప్పటి డీసీవో సత్యనారాయణ విచారణ నిర్వహించి రూ.2 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు గుర్తించారని.. ఆ తదుపరి సర్‌ఛార్జి నోటీసులు జారీ చేసి సీఈవో పరమేశ్‌ను విధుల నుంచి తొలగించారన్నారు. సొసైటీలో రూ.45 లక్షలు రికవరీకి నోటీసులు ఇస్తే దీక్షలు చేయడమేమిటని ప్రశ్నించారు. మాజీ సర్పంచి బాపురెడ్డి, నాయకులు గడ్డం లక్పతిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నల్ల శ్రీనివాస్, కొత్తూర్ సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

కూలీ ఆత్మహత్య

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన గోలి సదానందం (48) ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సదానందం సెంట్రింగ్ కూలీగా పనిచేసేవారు. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడటంతోపాటు మద్యానికి బానిసయ్యారు. ఆదివారం అతడి భార్య, కుమారుడితో కలిసి ఊరెళ్లి మంగళవారం ఇంటికి చేరుకున్నారు. తలుపులు తీసేసరికి సదానందం ఇంట్లో ఉరేసుకొని కనిపించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోరుట్ల కోర్టు ఏపీపీగా రాజేశ్ ఖన్నా



కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏపీపీ)గా గొనె రాజేశ్ ఖన్నాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కోరుట్ల పట్టణానికి చెందిన ఆయన 2008 నుంచి న్యాయవాదిగా పని చేస్తున్నారు. మూడేళ్లపాటు ప్రభుత్వం తరఫున సివిల్ కేసులు వాదించేందుకు నియమించినట్లు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉచిత మెడిసిన్ సీట్లు సాధించారు. పెద్దాపూర్ గురుకులంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి నీట్‌లో మంచి ర్యాంకులు పొందిన పి.సాయి స్నేహిత్ (ములుగు), కె. హర్షిత్ (ఆసిఫాబాద్) ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉచిత ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపల్ మహిధర్, అధ్యాపకులు అభినందించారు.


హర్షిత్


సాయి స్నేహిత్

రాయికల్: రాయికల్ మండలం మూటపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ముక్కెర శేఖర్-విజయలక్ష్మి దంపతుల కూతురు శ్రీచందన నీట్ 2024లో 637 మార్కులు పొందగా రాష్ట్ర స్థాయిలో 437 ర్యాంకు సాధించి ప్రతిభ చాటింది. సికింద్రాబాద్‌లో గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సాధించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.


శ్రీచందన

ఆత్మహత్యాయత్నం

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండల కేంద్రంలోని అంగడిబజార్ ప్రాంతంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. కొడిమ్యాలకు చెందిన నాంపెల్లి చంద్రయ్యకు అతడి అన్న రాజేశంకు కొంత కాలంగా ఆస్తి పంపకాల్లో గొడవలు జరుగుతున్నాయి. దీనిపై చంద్రయ్య పెద్దమనుషులను సంప్రదించారు. వారు పంచాయతీ నిర్వహించి రాజేశంకు మద్దతుగా మాట్లాడటంతో క్షణికావేశానికి లోనైన చంద్రయ్య.. ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు చంద్రయ్యను అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.


ఒంటిపై డీజిల్ పోసుకుంటున్న చంద్రయ్య

నూతన వస్త్రాల పంపిణీ

జగిత్యాల గ్రామీణం: టీఆర్‌నగర్‌లోని గాయత్రి విశ్వకర్మ ఆశ్రమంలోని వృద్ధులకు స్థానిక వైద్యులు నూతన వస్త్రాలను అందజేశారు. దసరా, బతుకమ్మ పండగల సందర్భంగా చీరలు, టవల్స్, పండ్లు, పిండి వంటలను మంగళవారం అందజేశారు. వైద్యులు పద్మా రాథోడ్, గూడూరి శ్రీలత, వొడ్నాల రజిత, రాచకొండ నాగరత్న, ఆశ్రమ నిర్వాహకులు టీవీ సూర్యం, బెజ్జంకి లక్ష్మణ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పులి రాము పాల్గొన్నారు.